ప్రజాశక్తి

ఆదివారం 24 డిసెంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

కనీస వేతనం.. పర్మినెంట్ ఉద్యోగం

ఒక్కటే నినాదం

- కొనసాగుతున్న అంగన్‌వాడీ, ఎస్ఎస్ఎ ఉద్యోగుల ఆందోళనలు
- ఈ నెల 26 నుంచి జివిఎంసి కార్మికులు
- 29 నుంచి వాలంటీర్లు

శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తదితరులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'అన్ని దారులూ రోమ్ నగరం వైపే..' అన్నట్టు నేడు ఏ రోడ్డు చూసినా నినాదాలు, ఆందోళనలతో దర్శనమిస్తోంది. 'సమాన పనికి సమాన వేతనం.. పర్మినెంట్ ఉద్యోగం' ఈ ఒక్క నినాదమే అంతటా మార్మోగుతోంది. 2019 ఎన్నికల సందర్భంగా రాజకీయ నాయకులు ఇచ్చిన హామీల అమలు అటకెక్కడంతో 2024 ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వంపై చిరుద్యోగులంతా శంఖారావం పూరిస్తున్నారు. ఈ ఎన్నికలు కాస్తా అయిపోతే మళ్లీ ఐదేళ్ల పాటు తమను పట్టించుకునే నాథుడే ఉండరని వారంతా ముక్తకంఠంతో తమ హక్కుల సాధనకు నడుం బిగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రాజెక్టులు, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే చిరుద్యోగులైన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానంటూ ప్రతిపక్ష నేతగా ఉన్న వేళ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని ఇప్పుడీ కార్మికులంతా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆందోళనలతో అట్టుడుకుతున్న నగరం

విశాఖ నగరం కొద్ది రోజులుగా ఆందోళనలతో అట్టుడుకుతోంది. ప్రతిష్టాత్మకమైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోకి జిందాల్ వంటి సంస్థలు జొరబడి చేజిక్కించుకునే కుట్రలపై కార్మికవర్గం మిగతా 2లో..

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకట కుమారి

కోవిడ్‌పై అప్రమత్తత అవసరం

మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కోవిడ్ కేసుల పట్ల జివిఎంసి యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. నగరంలో ఇప్పటికే నమోదైన కేసులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. శనివారం జివిఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో పాత్రికేయుల సమావేశం అనంతరం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోన్ల కమిషనర్లు, ఎఎంహెచ్ఒలతో కోవిడ్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో మధురవాడ దసపల్లా హిల్స్, చిన ముషిడివాడ తదితర ప్రాంతాలలో ఆరు కేసులు నమోదయ్యాయని, కేసులు పెరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని చర్యలూ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యుపిహెచ్‌సి సెంటర్లలో అన్ని వైద్య పరీక్షలకూ సంబంధించిన కిట్లును సిద్ధం చేయాలన్నారు. కోవిడ్ కేసులు ఉన్న ప్రాంతాలలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఆయా ప్రాంతాలలో మిగతా 2లో..

'డాల్ఫిన్' కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

▶ వార్త 2లో..

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

▶ వార్త 2లో..

హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులు ఆపాలి

▶ వార్త 5లో..

జ్యోతి ప్రజ్వలన చేసి ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న అతిథులు

అట్టహాసంగా క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గాదిరాజు ప్యాలెస్ వేదికగా మూడు రోజులుపాటు తలపెట్టిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో 9వ ఎడిషన్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. శనివారం మధ్యాహ్నం విశాఖపట్నం ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారిలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రాంభించారు. ఈ సందర్భంగా ఎంవివి. సత్యనారాయణ మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావం, నాణ్యతతో సేవలు అందజేసి ప్రజల విశ్వాసాన్ని పొందాలని అన్నారు. విశాఖ నగరానికి ప్రపంచ పటంలో విశిష్ట స్థానం ఉందని తెలిపారు. అందుకే ఎన్ఆర్ఐలు, సాఫ్ట్‌వేర్ అధికారులు నగరంలో ఇళ్లు కొనడానికి, ఇక్కడ మిగతా 2లో..

పైపులైన్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోండి

మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం, వెంకట నగరం పంచాయతీ సముద్రతీరంలో కాకినాడ సెజ్ పరిశ్రమల వ్యర్థ రసాయనాల విడుదలకు పైపులైన్ నిర్మించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు శనివారం లేఖ రాశారు. పాయకరావుపేట మండలం, వెంకటనగరం పంచాయతీలోని వెంకటనగరం, రాజా నగరంలో 4500 మంది మత్స్యకారులు న్నారని తెలిపారు. వెంకటనగరంలో 96 బోట్లు, రాజా నగరంలో 58 బోట్లు ఉన్నాయన్నారు. 1540 మంది సముద్రంలో చేపల వేటాడి బతుకుతున్నారని తెలిపారు. ఇప్పటికే డెక్కన్ కంపెనీ సముద్రంలోకి విడిచిపెడుతున్న వ్యర్థ రసాయనాలు వల్ల చేపల ఉత్పత్తి తగ్గిందని తెలిపారు. సముద్రంలో చేపలు దొరక్క బతుకు దెరువు కోసం మత్స్యకారులు వలసలు పోతున్నారని తెలిపారు. దొరికిన చేపలు కూడా రసాయనాల వాసన రావడంతో అమ్ముకోవడం కష్టంగా ఉందన్నారు. ఏళ్ల తరబడి ఈ ఇబ్బందులు పడుతుండగానే మరోవైపు కొత్తగా 20 కిలోమీటర్లకుపైగా ఉన్న కాకినాడ సెజ్ పరిశ్రమల వ్యర్థాలు విడిచిపెట్టేందుకు పాయకరావుపేట మండలం వెంకటనగరం సముద్ర తీరంలో పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. ఇక్కడ వ్యర్థాలు సముద్రంలో విడిచిపెడితే వెంకటనగరం, రాజానగరం మత్స్యకారుల ఉపాధి పూర్తిగా దెబ్బతింటుందని తెలిపారు. ఊర్లో బతకలేక వలసలు పోవాల్సిన దుస్థితి ఏర్పడనుందని పేర్కొన్నారు. హేచరీస్ యజమానుల ఒత్తిళ్లతో కాకినాడ సెజ్‌కు రెండు కిలోమీటర్ల దూరంలోని సముద్ర తీరంలో పైపులైన్ నిర్మించకుండా 20 కిలోమీటర్ల దూరంలోని వెంకటనగరం తీరంలో విడిచిపెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఇది ఎంత మాత్రమూ సరికాదని తెలిపారు. పైపులైన్ నిర్మాణానికి పంచాయతీ అనుమతి లేదన్నారు. కాలుష్య నియంత్రణ మండలి అనుమతి ఇవ్వలేదన్నారు. అయినప్పటికీ నిబంధనలన్నీ ఉల్లంఘించి వెంకటనగరంలో పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టేందుకు సిద్ధపడుతున్నారన్నారు. ఇది చట్ట వ్యతిరేక చర్య అని తెలిపారు.

స్థానిక పంచాయతీల ఆమోదం లేకుండా ఇలాంటి చర్యలు చేపట్టడం వల్ల ప్రజాస్వామ్యానికి విఘాతమన్నారు. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జెడ్) నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. దీనివల్ల తీర ప్రాంతంలో మత్స్యకారులు జీవించలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. కోట్లాది రూపాయల ఆదాయం సమకూర్చే వృత్తిని కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇప్పటికైనా జోక్యం చేసుకొని మత్స్యకారులకు న్యాయం చేయాలని మంత్రిని కోరారు.

మొదటి పేజీ తరువాయి..

సమావేశంలో పాల్గొన్న అధికారులు

కోవిడ్‌పై అప్రమత్తత అవసరం

బ్లీచింగ్, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించి వ్యర్థాలు లేకుండా పారిశుధ్య కార్మికులచే ఆయా ప్రాంతాలను నిత్యం పరిశుభ్రపరచాలని ఆదేశించారు. కోవిడ్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సచివాలయ స్థాయిలో వాలంటీర్లు, ఎఎన్ఎంల ద్వారా ఇంటింటి సర్వే జరపాలన్నారు. కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ నగరంలో కోవిడ్ కేసులు వస్తున్న దృష్ట్యా జివిఎంసి అన్ని చర్యలూ చేపట్టిందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలకు జివిఎంసి యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. కోవిడ్ సోకిన వ్యక్తులను హోం ఐసోలేషన్‌లో ఉంచామని, వారికి అన్ని వైద్య పరీక్షలూ జరిపి కిట్లు అందించామని అన్నారు.

ఒక్కటే నినాదం

తిరగబడుతోంది. వెయ్యి రోజులకు పైగా ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటాన్ని వీరు సాగిస్తున్నారు. జిందాల్ రాకను నిరసిస్తూ మూడు రోజులుగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీలు కనీస వేతనాలు, ఉద్యోగ రక్షణ వంటి డిమాండ్లతో సమ్మె కొనసాగిస్తున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు నాలుగు రోజులుగా ఆందోనలు చేస్తున్నారు.

ఏళ్ల తరబడి కనీస వేతనాలకు నోచుకోని వర్కర్లు

సంవత్సరాల నుంచి ప్రభుత్వ శాఖల్లో ప్రభుత్వోద్యోగులతో సమానమైన పని చేస్తూ అరకొర జీతాలతోనే విద్య, వైద్యం, ఐసిడిఎస్, నగర పాలక సంస్థ, రెవెన్యూ ఇతర శాఖల్లో చిరుద్యోగులు ప్రభుత్వాల మాయమాటలకు మోసపోతూనే ఉన్నారు. జీతాల పెంపు గుర్రె తోక బెత్తెడు అన్న రీతిలో ఉంటుంది తప్ప సమాన పనికి సమాన వేతనం అమలు గగనంగా ఉంది. పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గత చంద్రబాబు సర్కారు, నేటి జగన్ ప్రభుత్వం మోసానికి పాల్పడుతూనే ఉన్నాయి. జివిఎంసిలో పనిచేస్తున్న వేల సంఖ్యలో కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదు. పారిశుధ్య కార్మికులు చేసే కష్టమైన శ్రమను చూసి వేతనాలు చెల్లించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు వెల్లడించినా ప్రభుత్వం అమలు చేయడం లేదు. పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ కూడా చేయడం లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 26 నుంచి వీరూ సమ్మెలోకి దిగుతున్నారు. ప్రభుత్వం చెప్పుచేతల్లో ఉండి, ఈ ప్రభుత్వమే నియమించిన వాలంటీర్లు సైతం సమ్మె సైరన్ మోగించడానికి సిద్ధం కావడం విశేషం. అరకొర జీతాలతో తమ విధులు కనాకష్టంగా మారాయంటూ ఈ నెల 29 నుంచి సమ్మె చేపట్టేందుకు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది.

ఎక్స్‌పో ప్రారంభ వేడుకలో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

అట్టహాసంగా క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రారంభం

పెట్టుబడి పెట్టడానికి ఇష్టపడుతున్నారని చెప్పారు. మేయర్ హరివెంకట కుమారి మాట్లాడుతూ నగరం శరవేగంగా విస్తరిస్తోందన్నారు. జివిఎంసి ద్వారా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఇక్కడి సౌకర్యాలు, ప్రశాంతమైన వాతావరణం కారణంగా ఉద్యోగ విరమణ పొందిన వ్యక్తులు ఇక్కడ స్థిరపడాలని కోరుకుంటారని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ అధ్యక్షుడు ధర్మేందర్ వరద మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ ఎక్స్‌పోలో 96 స్టాల్స్‌లో 300కు పైగా నిర్మాణాలను అమ్మకందారులు కొనుగోలుదారులకు అందుబాటులో ఉంచారన్నారు. ఇక్కడ ప్లాట్లు బుక్ చేసుకున్న వారికి ప్రత్యేక తగ్గింపు అందిస్తున్నామని, బ్యాంకు రుణ సదుపాయాన్ని కుడా ఇక్కడే పొందేలా ఏర్పాట్లు చేసామని తెలిపారు. ఎస్‌బిఐ డిజిఎం పంకజ్ రాయ్ గృహ కొనుగోలుదారులకు అందుబాటులో ఉన్న వివిధ రుణ ఎంపికలు, బ్యాంకు అందించే ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ కెఎస్ఆర్‌కె.రాజు (సాయి), ఎక్స్‌పో గౌరవ కార్యదర్శి కన్వీనర్ వి.శ్రీను, క్రెడాయ్ ఎపి ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు, క్రెడాయి విశాఖపట్నం అధ్యక్షులు వి.ధర్మేందర్, ఉపాధ్యక్షులు సిహెచ్.గోవింద్ రాజు, సంయుక్త కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.నరసింహారావు, కమిటీ సభ్యులు ఎం.కృష్ణ మోహన్ రావు, శంక పవన్ పాల్గొన్నారు.

దాసోహం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

పాలక, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కళ్లుండీ చూడలేని, చెవులుండీ వినలేని కబోధుల వలే ప్రవర్తిస్తున్నాయి. జిత్తుల మారి ఎత్తులు వేస్తూ మోడీ భజనలో తమ బాధ్యతలను మర్చిపోతున్నాయి. లేదు..లేదు దాసోహ మవుతున్నాయి. అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్ష టిడిపి, మిత్రపార్టీ జనసేనకు ఏ మాత్రం ఆత్మగౌరవం, ఆత్మాభిమానమున్నా తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకపు ప్రయత్నాలు, కుట్రలను అడ్డుకోవడానికి కనీస ప్రయత్నమైనా చేసేవి. స్టీల్‌ప్లాంట్‌ను ముక్కముక్కలుగా జిందాల్ వంటి ప్రయివేటు సంస్థల చేతుల్లో పెడుతున్నా, ఇది తప్పు అని చెప్పే ధైర్యంలేక వైసిపి, టిడిపి, జనసేన మోడీ ముందు మోకరిల్లుతున్నాయి. బ్లాస్ట్‌పర్నేస్-3 నడపడానికి జిందాల్‌తో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేసుకున్న రహస్య ఒప్పందం బయటపెట్టమనడానికి కూడా ఈ పార్టీలకు నోరు రాలేదు. ఈ మౌనం స్టీల్‌ప్లాంట్‌ను ఎలాగైనా అమ్మాలని చూస్తున్న మోడీకి వెనుక నుంచి ఈ మూడు పార్టీలు అందిస్తున్న సహకారంగానే భావించాలి. స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా వెయ్యి రోజులకు పైగా కార్మికులు పట్టుదలతో పోరాటం సాగిస్తున్నారు. కార్మికుల పోరాటానికి నైతిక మద్దతు, బలం ఇవ్వాల్సిన పార్టీలు బిజెపి పంచన చేరడానికే పోటీపడుతున్నాయి. చరిత్రలో చేసిన తప్పిదాలను సరిదిద్దుకొనే క్రమంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, సొంత గనులు సాధనకు ముందుకువస్తే కొంతైనా గౌరవం దక్కేది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పార్టీలకతీతంగా పోరాడుదామని సిపిఎం ఏనాడో సహేతుకమైన పిలుపునిచ్చింది. సూచన చేసింది. అయినా ప్రధాన పార్టీల్లో కనీస కదలిక లేదు. మోడీ కుట్రలు, కుతంత్రాలిక్కడ సాగనివ్వబోమని పార్టీలన్నీ కలిసి దండెత్తితే స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి మోడీ సాహసించేవారా ? సొంత గనులు కేటాయించకుండా వుండేవారా ? బ్లాస్ట్‌పర్నేస్-3ను మూయించి, తరువాత తెరవడానికి జిందాల్‌తో రహస్య ఒప్పందం చేసుకొనే

ప్రక్రియ సాగేదా ?. స్టీల్‌ప్లాంట్ సాధన స్ఫూర్తితో రాజకీయ పార్టీలన్నీ ఏకోన్ముఖంగా కదిలితే స్టీల్‌ప్లాంట్‌కు ఈ దుర్గతి పట్టేదికాదు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై యువగళం ముగింపు సభలో కనీసం మాట్లాడలేదు. అధికార వైసిపి నోరెందుకు విప్పడంలేదో ప్రజలు ప్రశ్నించాలి.

తెలంగాణా కంటే ఎక్కువ జీతం ఇస్తానని ఎన్నికల్లో చెప్పిన మాట నిలబెట్టుకోవాల్సిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, అందుకు విరుద్ధంగా అంగన్‌వాడీలను భయపెడుతున్నారు. పేద కుటుంబాల పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా, అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం గుర్రాలతో తొక్కించినా వెనుకడుగు వేయకుండా ఐక్యంగా పోరాడిన అంగన్‌వాడీల ధైర్య,సాహసాలను ఈ ప్రభుత్వం తెలుసుకొని సమ్మెపై నిర్బంధం ప్రయోగించకుండా, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి. 2017 నుంచి బకాయిపడ్డ టిఎ, డిఎ చెల్లించాలని, ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం, గ్రాట్యూటీ, పదవీ విరమణ సదుపాయాలు, ప్రభుత్వ పథకాలు అమలుచేయాలని చేస్తున్న సమ్మె చాలా సముచితమైనది. అందుకే ప్రజలు మద్దతు వీరికి పెరుగుతోంది. ఎస్ఎస్ఎలో వివిధ కేటగిరీల కింద పనిచేస్తున్న ఉద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం రెగ్యులర్ చేయకపోవడంతో అనివార్యంగా వారుకూడా సమ్మెలో దిగారు. రెగ్యులర్ చేసేవరకు మినిమం టైం స్కేల్ సహా ఇతర సదుపాయాలు అమలు చేయాలి. స్కీం వర్కర్లు, వివిధ ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా వ్యవహరించకపోతే భవిష్యత్‌తో ప్రతికూల ఫలితాలు చూడాల్సి వస్తుందని ప్రభుత్వం గ్రహిస్తే మంచిది.

'డాల్ఫిన్' కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలోని డాల్ఫిన్ హోటల్‌లో తొలగించిన దళిత కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. కెవిపిఎస్ ఆధ్వర్యంలో శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో దళిత సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. అంబేద్కర్ సొసైటీ నాయకులు బొడ్డు కల్యాణరావు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ మాట్లాడుతూ వాష్ పెంట్రీ బాయ్ సత్యంను కులం పేరుతో దూషించిన సూపర్‌వైజర్‌కు శిక్ష పడకుండా యాజమాన్యం కాపాడిందని తెలిపారు. ఈ చర్య ద్వారా కుల వివక్షతకు యాజమాన్యం పాల్పడిందని చెప్పారు. సూపర్‌వైజర్ చర్యలకు వ్యతిరేకంగా 32 మంది యాజమాన్యానికి ఫిర్యాదు చేశారని, వారి నాలుగు రోజుల వేతనాలను యాజమాన్యం కట్ చేసిందని అన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై కార్మిక శాఖకు కెవిపిఎస్ ఫిర్యాదు చేయగా కార్మికులకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. దాన్ని అమలు చేయకుండా డాల్ఫిన్ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించిందని తెలిపారు. హైకోర్టు కూడా స్పందించి దిగువ కోర్టు ఇచ్చిన సూచనలను పాటించాలని పేర్కొందని తెలిపారు. అయితే యాజమాన్యం అందుకు సిద్ధపడకుండా సుప్రీంకోర్టుకు వెళ్లడం దుర్మార్గమన్నారు. అంతేకాకుండా వాష్ పెంట్రీ బాయ్ సత్యంను రాజీనామా చేయించి, తప్పుడు సాక్ష్యం కోర్టులో చెప్పి సూపర్‌వైజర్‌ను యాజమాన్యం రక్షించిందని విమర్శించారు. ఇప్పటికైనా యాజమాన్యం అక్రమంగా తొలగించిన దళిత కార్మికులను విధుల్లోకి అనుమతించాలన్నారు. డాల్ఫిన్ యాజమాన్యం కుల వివక్షతను విడనాడాలని డిమాండ్ చేశారు. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తే డాల్ఫిన్ హోటల్ ఎదుట అన్ని దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎంవి ప్రసాదరావు, ఎఆర్.కూరపాటి, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జిఎ.నారాయణరావు అన్నారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా, విభజన హామీలు, రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక రాయితీలు వంటి అంశాలు మరుగున పడిపోవడం అన్యాయమని అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంటు శీతాకాల సమావేశాల సమయంలో తాము ఢిల్లీ వెళ్లి ప్రధాన రాజకీయ పార్టీల నాయకులను, ఇతర పార్లమెంటు ఫ్లోర్ లీడర్లను కలిసి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వచ్చేలా కృషి చేయాలని కోరామన్నారు. జాతీయ నాయకులు ఇచ్చిన సూచన మేరకు తమ పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా సాధన కోసం పోరాట కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఫిబ్రవరిలో రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తామన్నారు. అనంతరం విశాఖలో పది వేల మందితో బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రత్యేక హోదా సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల్లో తమ సంస్థ తరపున పోటీ చేస్తామన్నారు. సమావేశంలో కాశీభట్ల స్వరూప్, లేపాక్షి మూల, హైకోర్టు అడ్వకేట్ యాపాటి అరుణ్ బాబు, సీతారామస్వామి గోన, వి.ప్రతాప్ రాజు, మంత్రి రవి, చంద్రశేఖర్, కల్యాణ్, అప్పలరాజు, షరీఫ్, చిన్నికృష్ణ పాల్గొన్నారు.

మద్య నిషేధం మరిచిన జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జగన్మోహన్ రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం దక్షిణ నియోజవర్గం చావుల మదుం జంక్షన్‌లో మహిళా సమాఖ్య, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్న మద్యపానాన్ని దశలవారీగా నిషేదిస్తామన్న ముఖ్యమంత్రి తన హామీని నిలుపుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు దేవుడమ్మ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వై.రాంబాబు, యు.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల కిసాన్ మేళాలు

ప్రజాశక్తి- పెందుర్తి : జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా జివిఎంసి 95వ వార్డు సుజాతనగర్‌లో సన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ చైర్మన్ గంగినేని శ్రీనివాసులనాయుడు అధ్యక్షతన శనివారం కిసాన్ మేళా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని, కిసాన్‌మేళాలో స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ కిసాన్‌మేళాలో చిరుధాన్యాలు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, ప్రకృతి సాగు, సస్యరక్షణపై అవగాహన కల్పించే సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన సంతోష్, సదాశివుని రవితేజ, బొడ్డ దేముడుబాబు, కొత్తపల్లి అప్పలరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

పద్మనాభం: మండలంలోని అనంతరం గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం పురస్కరించుకొని బ్యాంకు మేనేజర్ రవికుమార్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన గొర్రుపాటి పెద్ద ఎర్రి నాయుడును సత్కరించారు. బ్యాంకు సిబ్బంది భవానీ, శంకరరావు, సూరిబాబు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధి ముసుగులో దోపిడీ



నిరుద్యోగదీక్షలో మాట్లాడుతున్న ప్రశాంతి

ప్రజాశక్తి -ములగాడ : హెచ్‌పిసిఎల్‌లో ఉపాధి పేరుతో దోపిడీ చేస్తున్నారని, వీరందరూ బడాబాబుల ముసుగులో దర్జాగా తిరుగుతూనే ఉన్నారని జనసేన పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంగా ప్రశాంతి ఆరోపించారు. శనివారం హెచ్‌పిసిఎల్ గేటు వద్ద జనసేన ఆధ్వర్యంలో నిరుద్యోగ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ, నాలుగేళ్లగా హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టర్లతో లాలూచీ పడి యువతకు ఉపాధి కల్పించకుండా అక్రమాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టాల్సిన అధికారులు, పోలీసులు కూడా సహకారం అందించడం వల్లే నేడు నిరుద్యోగులు రోడ్డెక్కే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమాలు పాల్పడిన నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 61 వ వార్డు జనసేన అధ్యక్షుడు దుంగా దేవరాజ్ మాట్లాడుతూ మాఫియా తరహాలో ఇక్కడ వ్యాపారం జరుగుతోందని ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. నిరుద్యోగుల కోసం జనసేన ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో అంగ చంద్రకళ, దేవర అప్పలరాజు పాల్గొన్నారు. నిరుద్యోగ నిరసన దీక్షకు కార్మికుల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది.

కుట్టు శిక్షణతో స్వయంఉపాధి

మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న తహసీల్దార్ రమేష్

ప్రజాశక్తి -భీమునిపట్నం : కుట్టు శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని తహశీల్దార్ సి హెచ్‌వి రమేష్ అన్నారు. శనివారం జివిఎంసి మూడో వార్డు తోటవీధి, కల్యాణ మండపంలో 9 రోజుల పాటు నిర్వహించనున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యాన ఉషా సిల్క్, సిద్ధి స్వావలంబన సంస్థ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమంలో మహిళా మండలి ప్రతినిధి మాధవి, పార్వతి, వరలక్ష్మి, హేమలత, ఉషా సిల్క్ సంస్థ కోఆర్డినేటర్ కోన శివయ్య, శిక్షకురాలు బేగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా 25 మందికి ఉచితంగా కుట్టు మిషన్లను తహశీల్దార్ రమేష్ అందజేశారు.

1 నుంచి సర్పంచ్‌ల శంఖారావం

ఎపి పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి- సీతమ్మధార : పంచాయతీల పరిధిలోని 16 డిమాండ్ల సాధనకు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సర్పంచుల శంఖారావం పేరిట ఉద్యమిస్తామని ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం విశాఖ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మీడియాతో మాట్లాడుతూ, వైసిపి పాలనలో గ్రామ పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయన్నారు. కేంద్రం ఇచ్చే ఆర్థికసంఘం, ఉపాధి హామీ నిధులను దారి మళ్లించి పంచాయతీలను నామమాత్రం చేశారని ఫిర్యాదుపై విచారణలో వాస్తవమేనని స్పష్టమైనా, రాష్ట్రానికి మూడు నెలల క్రితమే నోటీసులిచ్చినా స్పందన లేదన్నారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు సమాంతరం సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారని, ఇపుడు గృహసారథులు, కన్వీనర్లతో చట్ట, రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు సిఎం జగన్ ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. రాష్ట్రంలో 12,918 గ్రామ పంచాయతీల్లో తాగునీరు, డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరించలేని దయనీయ స్థితిలో సర్పంచ్‌లు ఉంటే, పంచాయతీరాజ్‌మంత్రి బూడి ముత్యాలనాయుడు దమ్మిగానే వ్యవహరిస్తున్నారే తప్ప, తమ శాఖకు సంబంధించి ఎటువంటి పనులు చేయడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో సర్పంచుల సత్తా ఏంటో వైసిపి ప్రభుత్వానికి చూపిస్తామని రాజేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మి ముత్యాలరావు, ఉపాధ్యక్షుడు వై.వినోద్‌రాజు, నాయకులు ఎ.రామకృష్ణ, నాగ రాజు, ముత్యాలరావు, ధనుంజయరావు పాల్గొన్నారు.

డ్రైవర్ లెస్ కార్ల తయారీలో సవాళ్లు

గీతం సదస్సులో నార్వే నిపుణుడు దుర్గాప్రసాద్

సదస్సులో పాల్గొన్న నార్వే నిపుణుడు బి.దుర్గాప్రసాద్

ప్రజాశక్తి -మధురవాడ : మానవ నియంత్రణ లేకుండా నడిచే స్వయం ప్రతిపత్తి వాహనాల తయారీపై ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలలో పలు సవాళ్ళు ఎదురవుతున్నాయని, అయితే వాటిని డీప్ లెర్నింగ్ ఆల్గారిథమ్స్, కృత్రిమ మేధతో అధిగమించవచ్చునని నార్వేలోని ఎన్‌టిఎన్ విశ్వవిద్యాలయం పరిశోధకుడు, ప్రవాస భారతీయుడు డాక్టర్ బి.దుర్గాప్రసాద్ వెల్లడించారు. శనివారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ (ఐఇఇ) విద్యార్థి విభాగం నిర్వహించిన '2డి అండ్ 3డి విజన్ ఫర్ అటానమస్ డ్రైవింగ్' అనే అంశంపై మాట్లాడారు. సంక్లిష్టమైన, శక్తి వంతమైన అల్గారిథమ్స్ ఉపయోగించడం ద్వారా స్వయంప్రతిపత్తమైన వాహనాలు సమర్థంగా గమ్యస్థానాలను చేరుతాయన్నారు. ప్రతికూలమైన వాతావరణ పరిస్థితులు, పాడైపోయిన రహదారులు, నీరు, మంచు నిలిచి ఉండే మార్గాలలో మనిషి మాదిరిగా స్పందించి వాహనాలను నడపడానికి ప్రత్యేకంగా సెన్సార్లను అమర్చడం జరుగుతుందన్నారు. 2డి, 3డి సెన్సార్లు వాహన వేగం, దిశ, త్వరణం, దాని మార్గంలో ఉండే అడ్డంకులతో సహ అనేక రకాల సమాచారాన్ని సేకరించి వాహనంలో ఉండే ఆన్‌బోర్డు సిస్టమ్ విశ్లేషిస్తుందని అది పరిస్థితులకు అనుగుణంగా ప్రతిస్పందించడానికి వీలు కల్పిస్తుందన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఆలోచనలతో అటానమస్ వాహనాల డిజైనింగ్‌పై దృష్టి సారించాలని సూచించారు. ఇఇఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ జె.బి. సెవెన్‌లైన్ అధ్యక్షత వహించగా విద్యార్థి కౌన్సిలర్ డాక్టర్ మహ్మద్ కె.ఎమ్.చిష్టి, ఫ్యాకల్టీ సలహాదారులు డాక్టర్ బి. సూరిబాబు, డాక్టర్ కె.రేణు, డాక్టర్ యు.రత్నకుమారి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యానికి కృషి

ప్రజాశక్తి-ములగాడ: ఇఎస్‌ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎం రామిరెడ్డి అనే వ్యక్తికి కెజిహెచ్‌కు పంపి మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేయడంతోపాటు, ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్యంపై ఆరా తీసిన వైసిపి నగర కార్యదర్శి శరగడం పత్తిరావు చొరవపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నారు. ఈనెల 21న జగన్ జన్మదినం సందర్భంగా ఇఎస్‌ఐ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీకి వెళ్లిన పత్తిరావు, అక్కడ రామిరెడ్డికి మెరుగైన వైద్యం ఆవశ్యకతపై అతని కుటుంబీకులు పత్తిరావు దృష్టికి తేగా, ఆయన ఇఎస్‌ఐ ఆసుపత్రి, కెజిహెచ్ వైద్యులతో మాట్లాడి, కెజిహెచ్‌లో జాయిన్ చేయించారు. మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌సూపరింటెండెంట్‌కు విన్నవించారు. శనివారం కెజిహెచ్‌కు వెళ్లి రామిరెడ్డిని పరామర్శించారు. ఒక రోగి వైద్యం పట్ల పత్తిరావు చొరవను పలువురు అభినందిస్తున్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి -మధురవాడ : పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ, ఎపి బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి పిలుపు మేరకు భీమిలి నియోజకవర్గం రెండో జోన్, ఏడవవార్డు మధురవాడ విద్యుత్ ఉపకేంద్రం వద్ద భీమిలి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ కంటుభుక్త రామా నాయుడు ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరాభారం, పన్నుల మోతతో సామాన్యులు, పేదల జీవితాలను దుర్భరం చేసే ప్రభుత్వాలు ఎంతోకాలం మనుగడ సాధించలేవని, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వానికి అదే గతి పట్టక తప్పదని హెచ్చరించారు. పెంచిన, అదనపు విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగిరాకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పసుపులేటి శ్రీనివాసరావు, సత్యనారా యణ, ఉప్పాడ అప్పారావు, పోతిన పైడిరాజు, తాతి పూడి ప్రదీప్, ప్రసాద్ పట్నాయక్, కె.సునీత పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ప్రజలకు నిరాశ మిగిల్చిన యువగళం

ప్రజాశక్తి- మాధవధార : పోలిపల్లిలో నిర్వహించిన తెలుగుదేశం యువగళం బహిరంగసభ, నేతల ఉపన్యాసాలు ఉత్తరాంధ్ర ప్రజలను తీవ్రంగా నిరాశపరిచాయని ఎపి స్టేట్ కాంగ్రెస్ ఒబిసి విభాగం చైర్మన్ మూల వెంకటరావు అన్నారు. ఎపి పునర్విభజన హామీలైన ప్రత్యేకహోదా, విశాఖ రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ, వాల్తేరు రైల్వే డివిజన్ రద్దు చేసి ఒడిశాకు తరలింపు వంటి ఉత్తరాంధ్రకు సంబంధించి ప్రధాన సమస్యలను యువగళం సభలో ముఖ్యనేతలు, మేధావులు ప్రస్తావించకపోవ డం గర్హనీయమన్నారు. విశాఖ మెట్రో రైల్, పోలవరం ప్రాజెక్టు, కేంద్ర విద్యాసంస్థల నిర్మాణాలు వంటి కేంద్రం నుంచి రావాల్సిన ఎన్నో ప్రయోజనాలకు మోక్షం లేకున్నా, బిజెపి విధానాలతో ఉత్తరాంధ్రకు తీవ్ర నష్టం జరుగుతున్నా ప్రతిష్టాత్మక యువగళం సభలో వీటి ఊసే లేకపోవడం దారుణమన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, అన్నింటినీ నెరవేరుస్తామని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ, ఎపిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చెప్పారన్నారు. ఇప్పటికైనా ఉత్తరాంధ్రకు న్యాయం చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

కారు బోల్తా : నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై కారు బోల్తా పడిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. శనివారం ఉదయం తుని నుండి విశాఖ వెళుతున్న కారు అడ్డరోడ్డు ఫ్లైఓవర్ దాటుతుండగా అదుపు తప్పి రోడ్డ ప్రక్కన లోయలో బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు క్షతగాత్రులను కారు నుండి బయటకు తీశారు. 108లో క్షతగాత్రులను నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనాస్థలిని స్థానిక ఎస్ఐ ప్రసాదరావు పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్లాబ్ నిర్మాణాలు అడ్డగింత

డంకింగ్ తొలగింపులో జివిఎంసి సిబ్బందితో స్థానికుల వాగ్వాదం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు కేంద్ర కారాగారం ఎదురుగా రామకృష్ణాపురంలో అనధికార కట్టడాలను శనివారం జివిఎంసి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అడ్డుకున్నారు. వాటర్ క్యాచ్‌మెంట్‌లో ఉన్న రామకృష్ణాపురంలో శ్లాబుల నిర్మాణాలకు ఇప్పటివరకు అనుమతి లేదు. కొన్నేళ్లుగా రేకులషెడ్లలో ఉన్న స్థానికులు శ్లాబుల నిర్మాణాలు చేపట్టేందుకు పోరాటం చేస్తూనే ఉన్నారు. అయితే జివిఎంసి నుంచి అనుమతులు లేనప్పటికీ శ్లాబు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్న సమాచారంతో టౌన్‌ప్లానింగ్, సచివాలయ సిబ్బంది అక్కడకు చేరుకొని అడ్డుకునే ప్రయత్నం చేశారు. శ్లాబ్ డంకింగ్ తొలగించాలన్న జివిఎంసి సిబ్బంది ప్రయత్నాలను స్థానికులు అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుని, ఒక్కసారిగాఉద్రిక్తత చోటుచేసుకుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలీసులు, జివిఎంసి సిబ్బంది మోహరించారు. ఎట్టకేలకు తాత్కాలికంగా పనులు ఆపేసారు.

టిడిపిలో ముస్లిముల చేరిక

పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు ముస్తాఫా కాలనీలో వైసిపికి చెందిన షేక్ అజీమ్ మరికొంతమంది ముస్లిం మైనార్టీలు శనివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే వెలగపూడి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం షేక్ అజీమ్ ఆలీ ఆర్థికసాయంతో ముస్లిం పేదలకు బియ్యం, దుప్పట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నజీర్, జిల్లా ఉపాధ్యక్షులు కాలేషా, జానీ ఫిరోజ్, టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ముగడ రాజారావు పాల్గొన్నారు.

జివిఎంసి ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ :11వ వార్డు ఆరిలోవలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎఫ్‌ఆర్‌యును శనివారం స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో వైద్యసేవలను డాక్టర్ అనితను అడిగి తెలుసుకున్నారు. కరోనా నేపథ్యంలో అవసరమైన టెస్టింగ్ కిట్స్, మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. వార్డు టిడిపి అధ్యక్షులు ముగడ రాజారావు, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం పాల్గొన్నారు.

జనసేన రెండో వార్డు అధ్యక్షునిగా శంకరరెడ్డి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డు జనసేన పార్టీ అధ్యక్షునిగా చిల్లపేట గ్రామానికి చెందిన శంకరరెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. తనను ఈ పదవిలో నియమించిన పార్టీ అధినేత పవన్ కల్యాణ్, నియోజకవర్గ కన్వీనర్ పంచకర్ల సందీప్‌కు ధన్యవాదాలు తెలిపారు

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎంపిపి వాసురాజు

ప్రజాశక్తి -తగరపువలస : చదువుతోనే జీవితంలో సమున్నత స్థానానికి చేరుకోవచ్చని,విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకోవాలని ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు (వాసురాజు) సూచించారు. శనివారం భీమిలి మండలం, దాకమర్రి జెడ్‌పి హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ చెల్లూరి పైడప్పుడు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపిటిసి నగేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి రఘునాథ్‌బాబు, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను, నేతలుపొట్నూరు చంద్రశేఖర్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ బి అప్పన్న, హెచ్‌ఎం కె సన్యాసి నాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీలోని జెడ్పీ హెచ్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ ట్యాబ్ లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నాడు నేడు పథకం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసిందన్నారు. ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మెంబర్ ఎండి భాష, నాయకులు దాడి బుజ్జి, యాదగిరి శేషు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం

పౌష్టికాహార ప్యాకెట్లు అందజేస్తున్న డాక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి- మధురవాడ : జిల్లా క్షయవ్యాధి నివారణాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ఆదేశాలతో మధురవాడ యూనిట్ పరిధిలో 110 మంది క్షయవ్యాధిగ్రస్తులకు డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, అరబిందో కంపెనీ సహకారంతో జిల్లాలోని టిబి రోగులకు ప్రతినెలా పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, సాయంత్రం పూట జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, కఫంతోపాటు రక్తం పడడం వంటి లక్షణాలుంటే సమీప ప్రభుత్వాసుపత్రికి వెళ్లి కఫం పరీక్ష చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వపరంగా ఆరునెలలు ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. టిబి రోగులకు అవసరమైన పౌష్టికాహారం సరఫరాకు దాతలు ముందుకు రావాలని కోరారు. టిబి యూనిట్ సూపర్వైజర్లు వి.వీరబ్రహ్మం, సురేష్, సిబ్బంది అనూష, కృష్ణ పాల్గొన్నారు

వైభవంగా సింహాచలేశుని ఉత్తర ద్వారదర్శనం

ప్రజాశక్తి- సింహాచలం: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని సింహాద్రి అప్పన్న శనివారం భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. వేకువ జామునే సోమవారం సుప్రభాత సేవతో మేల్కొల్పి పలు ఆరాధన సేవా కార్యక్రమాలు నిర్వహించి మేళతాళాలతో పల్లకిలో తీసుకుని వచ్చి ఉత్తర ద్వారం వద్ద శేష వాహనంలో ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. మొదటి దర్శనాన్ని అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబీకులకు కల్పించగా అనంతరం పలువురు విఐపిలు, స్థానికులకు స్వామి దర్శనాన్ని కల్పించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యూలైన్లో భక్తులకు మంచినీటి సదుపాయాన్ని, చిన్నారులకు పాలు బిస్కెట్లను అందజేశారు. దర్శనానంతరం భక్తులకు స్వామి ప్రసాదాన్ని అందజేశారు.

26 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి- ములగాడ : తమ సమస్యల పరిష్కారానికి జివిఎంసి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు ఈనెల 26నుంచి సమ్మెబాట పట్టనున్నారని ఎంపి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.నూకరాజు వెల్లడించారు. శనివారం మల్కాపురం సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతూ విపక్ష నేతగా పాదయాత్రలో, ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తానని, కనీస వేతనం అమలు చేస్తానని హామీఇచ్చి, నాలుగున్నరేళ్ల గడిచినా నేటికీ అమలు చేయలేదన్నారు. సుప్రీంతీర్పును గౌరవించి సమానపనికి సమాన వేతనం, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 కనీసవేతనం చెల్లింపు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వవైఖరిని నిరసిస్తూ, తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె చేస్తామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న సిఐటియు నేత నూకరాజు

యూనియన్ అధ్యక్షుడు కె. రమణ అధ్యక్షత వహించిన సమావేశంలో సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి సిఐటియు జోన్ అధ్యక్షులు పెంటారావు, బి.రాంబాబు, డి.రాము, బి.సూరిబాబు, రైల్ బాబు, ఆదినారాయణ, కృష్ణ, తిరుపతిరావు, ఎస్.ఉమ, పాప, ప్రభ ,లక్ష్మి, అప్పలకొండ, మీనా, రవణమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎపి భూహక్కు చట్టాన్ని రద్దు చేయాల్సిందే

అఖిలపక్ష సంఘాల సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : రాజ్యాంగ విరుద్ధమైన ఆంధ్రప్రదేశ్ భూహక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని అఖిలపక్ష సంఘం తీర్మానించింది. శనివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ విశాఖపట్నం జిల్లా కమిటీ, విశాఖపట్నం న్యాయవాదుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో న్యాయవాదుల సంఘం కమిటీ హాల్‌లో భూహక్కు చట్టంపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు అధ్యక్షత వహించిన సమావేశంలో న్యాయవాదుల జహార, ఐలు ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బగాది తులసీదాస్, వివిధ సంఘాల ప్రతినిధులకు ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై అవగాహన కల్పించి,ఇది ప్రజలకు ఎంత వ్యతిరేకమైనదో వివరించారు. న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ, భూహక్కు చట్టం రద్దుకు చేపట్టే ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు వివిధ సంఘాల ప్రతినిధులు సహకారమందించాలన్నారు. చిన్న, సన్నకారు రైతులు, ఎస్‌సి, ఎస్‌టిల భూహక్కులు నిర్ధారణలో ఎటువంటి న్యాయ పరిజ్ఞానం లేని ప్రభుత్వ అధికారులకు చట్టంలో ప్రాధాన్యతనివ్వడం సరికాదన్నారు సమావేశంలో ఐలు సభ్యులు సిహెచ్ ఆనందరెడ్డి, కొండ, జి, పూర్ణిమ, కెవై మణి, శాస్త్రి, ఐద్వా, సిఐటియు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, తెలుగుదేశం లీగల్ సెల్ సభ్యులు, న్యాయవాది ఐ.ఎం.అహ్మద్, ఇతర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంవిఆర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి -గాజువాక: రామచంద్రనగర్ క్యాంపస్‌లో ఎంవిఆర్ డిగ్రీ అండ్ పిజి కాలేజీ వార్షికోత్సవాన్ని శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ కె రామ్మోహనరావు జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించగా, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గాజువాక ఎంవీఆర్ కళాశాలకు మంచి గుర్తింపు ఉందని, ఈ కాలేజీలో చదివిన ఎందరో విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నతస్థితిలో స్థిరపడ్డారన్నారు. కాలేజీకి మంచిపేరు తెచ్చేలా విద్యార్థులంతా చదివి, ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.వైసిపి పాలనలో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని, విశాఖపట్నంలో ఐటి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి

వేడుకలను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ రామ్మోహనరావు

ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎం వెంకటరావు, సెక్రెటరీ డాక్టర్ వి రామారావు పాల్గొన్నారు.

బ్లూ ఎకానమీ పాలసీ రద్దు చేయాలి

మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి- సీతమ్మధార : సముద్రజలాల పరిరక్షణ, పర్యావరణం, మత్స్యకారుల జీవనోపాధి వంటి అంశాలేవీ పట్టించుకోకుండా, సముద్ర సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బ్లూఎకానమీ పాలసీని రద్దుచేయాలని మత్స్యకార కార్మిక సమాఖ్య అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. శనివారం పౌర గ్రంథాలయంలో ఆర్.రంగనాథ్ అధ్యక్షతన నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ మత్స్యకార్మిక సంఘం (ఎఐటియుసి) రెండవ రాష్ట్ర మహాసభలో మత్స్యకార్మిక జెండాను సీనియర్ నాయకుడు పల్లెటి పోలయ్య ఆవిష్కరించారు. అనంతరం సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సముద్రాన్నే నమ్ముకుని జీవిస్తున్న లక్షలాది మత్స్యకార కుటుంబాల జీవనోపాధి నేడు ప్రమాదంలో పడిందన్నారు. హైసీస్‌లో చేపలు పట్టుకునే అవకాశం అంతర్జాతీయ సంస్థలకు కల్పించడం, సముద్రతీరంలో వెలసిన ఫ్యాక్టరీలు, చమురు గ్యాస్ నిక్షేపాల ద్వారా రసాయన కాలుష్యంతో మత్స్య సంపద క్షీణిస్తోందన్నారు రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తరా మౌలిక సదుపాయాలు కల్పనలో విఫలమైందని, రూ.3,500 కోట్ల వ్యయంతో మెరైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించి శాశ్వతంగా వలసల్ని నివారిస్తామన్న వాగ్దానాలు నీటిమీద రాతలుగా మిగిలిపోయాయని ఆవేదన వెలిబుచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార నాయకులు చిన్న రాజగోపాల్, నాగభూషణం, లక్ష్మణరావు, కె పార్వతి, బిసిహెచ్ మసేన్, వాసుపల్లి నల్లయ్య, అమృతరావు, ఎం పైడిరాజు, పి నగంజానేజలు, అర్జున్ దాస్, సింగిడి సూరిబాబు, సూరప్పడు, ఎ విమల, జి బాలాజీ, సిద్ధాంతపు అప్పారావు, సింగిడి గణేష్, కాసుబాబు, నూకరాజు పాల్గొన్నారు. సముద్ర సంపదను కేవలం ఆర్థిక వనరుగానే కాకుండా, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ కోణంలో ప్రభుత్వాలు చూడాలని కోరారు.

తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ వాసులకు

నేడు వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి -గాజువాక : తోకాడ సమైక్య అపార్టుమెంట్ వాసులకు ఈనెల 24న గాజువాక క్లియర్ యు డయాగ్నస్టిక్ సెంటర్ సౌజన్యంతో వివిధ రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం వెంకటేశ్వరరావు, సెక్రెటరీ తవిటయ్య తెలిపారు. ఆదివారం ఉదయం ఏడుగంటల నుండి రక్తపరీక్షలు, ఇతరత్రా వ్యాధినిర్ధారణ టెస్టులను సమైక్య అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో నిర్వహిస్తారని, అపార్టుమెంట్‌లోని కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మత్తు అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని తునివలస గ్రామంలో మత్తు పదార్థాల అనర్థాలపై యువతకు సీడ్ ఆర్గనైజేషన్ న్యూలైఫ్ సెంటర్ ఫర్ హెల్పింగ్ సంస్థ ప్రతినిధి శ్రీకాశి అవగాహన కల్పించారు. 16 -30 ఏళ్ల వయసు గల వారు మద్యం, మత్తు పదార్థాలకు బానిసలై ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారన్నారు. వివిధ మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను సమగ్రంగా వివరించారు. మత్తుకు బానిసలైన వారికి తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి, వారిని మామూలు మనుష్యులను చేయడంతోపాటు, ప్రత్యేక సౌకర్యాలతో వారికి పునరావాస కేంద్రంలో ఉంచి మామూలు వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు.

చురుగ్గా రైల్వే అండర్ పాత్‌వే పనులు

పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం: జివిఎంసి 89వ వార్డు చంద్రనగర్ సమీపంలో, సింహాచలం రైల్వేస్టేషన్ వెనుక భాగంలో రైల్వే అండర్‌పాత్‌వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. శనివారం ఆయా పనులను స్థానిక ఎమ్మెల్యే పి.గణబాబు పరిశీలించి, దగ్గరుండి పర్యవేక్షించారు. వారం రోజుల నుండి భారీ క్రేనుల సాయంతో రైల్వే ట్రాక్‌ను కట్ చేసి, కాంక్రీట్ బాక్సులను అండర్ గ్రౌండ్‌లో అమర్చడం ద్వారా రైల్వేస్టేషన్ వెనుకభాగంలో ఉన్న ప్రాంతాలకు బస్సులు, అంబులెన్స్‌లు వంటి వాహనాల రాకపోకలకు వీలుగా అండర్‌పాత్‌వే నిర్మిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే పి.గణబాబు, బిజెపి నేతల కృషితో రైల్వే అండర్‌పాత్‌వే పనులకు కేంద్రం కోట్లాది రుపాయలను కేటాయించింది. నిర్మాణంపూర్తయి రైల్వేఅండర్ పాత్‌వే వినియోగంలోకి వస్తే రైల్వేస్టేషన్ దిగువ ప్రాంతవాసులకు రవాణా, రాకపోకల కష్టాలు తీరనట్లే.

ఎంపీ నిరంజన్ రెడ్డికి సత్కారం

ఎంపి నిరంజన్‌రెడ్డిని సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

ప్రజాశక్తి- వేపగుంట : వైసిపి రాజ్యసభ సభ్యుడు, సుప్రీంకోర్టు న్యాయవాది సిర్గాపూర్ నిరంజన్‌రెడ్డిని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఘనంగా సత్కరించారు. జివిఎంసి 52వ వార్డు మర్రిపాలెం డా లేఅవుట్‌లోని శివశివాని పాఠశాల యాజమాన్యం ఆహ్వానం మేరకు హైదరాబాద్ శివశివానీ పాఠశాల పూర్వ విద్యార్థిగా నగరానికి వచ్చిన నిరంజన్‌రెడ్డిని పాఠశాల యాజమాన్యంతో కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ, నిరంజన్‌రెడ్డి శివశివానీ విద్యార్థులందరికీ ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆళ్ల కృష్ణ, పవన్ కార్తీక్ పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్లాంట్ పనులు వెంటనే ఆపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని చింతలపూడి పంచాయతీ పరిధి బలిపురం సమీపం నుండి మారికకొండకు అదానీ కంపెనీకి చెందిన హైడ్రో పవర్ ప్లాంట్ పనులను తక్షణమే ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర డిమాండ్ చేశారు. హైడ్రో పవర్ ప్లాంట్ పనుల కోసం కోల్‌కతాకు చెందిన కొంతమంది కాంట్రాక్టర్లు యంత్రాల ద్వారా స్వాయల్ పరీక్షలు చేస్తున్న ప్రాంతాన్ని శనివారం వెంకన్న, దొర స్థానిక గిరిజనులతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైవాడ ప్రాజెక్టుపై హైడ్రో పవన్ ప్లాంట్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం పొందినట్లు గతంలో వచ్చిన వార్తలు ఇప్పుడు నిజమయ్యాయని తెలిపారు. రైవాడ రిజర్వాయర్ జీవనది అయిన శారదా నదిపై రెండు పంపు స్టోరేజ్ ప్రాజెక్టులు కట్టి దాని ద్వారా హైడ్రో పవర్ ప్లాంట్‌ను నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అటు గిరిజనులకు, ఇటు రైవాడ ఆయకట్టు రైతులకు చెందిన వేలాది ఎకరాలకు సాగునీరు, విశాఖవాసుల తాగునీటి అవసరాలకు తీవ్రమైన ప్రమాదం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని గిరిజన ప్రాంతంలో అదాని కంపెనీకి చెందిన అనేక ప్రాజెక్టులకు ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వగా, అక్కడ గిరిజనులు ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారని, కాని ఉపముఖ్యమంత్రి సొంతమండలం కావడంతో ఇక్కడి గిరిజనులు భయపడుతున్నారని తెలిపారు. అందువల్లే ఇక్కడ చకచకా పనులు జరిగిపోతున్నాయన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే చింతలపూడి పంచాయతీలో సగం గ్రామాలు ఖాళీ చేయాల్సి ఉంటుందన్నారు. పర్యావరణానికి తీవ్ర ప్రమాదం కలుగుతుందని తెలిపారు. ప్రాజెక్టు వలన ఈ ప్రాంతానికి తీవ్ర నష్టం జరుగుతుందని, వెంటనే అధికార

హైడ్రో పవర్ ప్లాంట్ పనులపై సిబ్బందితో మాట్లాడుతున్న వెంకన్న

పార్టీ నాయకులు జోక్యం చేసుకొని పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే హైడ్రో పవర్ ప్లాంట్ వల్ల జరిగే ప్రమాదాన్ని ప్రజల్లో ప్రచారం చేసి వారి మద్దతు కూడగట్టి అడ్డుకుంటామని హెచ్చరించారు.

మోదకొండమ్మ ఆలయం హుండీ చోరీ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి కొత్తూరు నర్సింగరావుపేట గ్రామంలోని మోదకొండమ్మ అమ్మవారి గుడిలో శుక్రవారం అర్ధరాత్రి హుండీ చోరీ జరిగింది. అర్ధరాత్రి సమయంలో దుండగుడు తన వెంట తెచ్చుకున్న గొడ్డలితో అమ్మవారి హుండీ పగలగొట్టి అందులో ఉన్న నగదు దొంగలించాడు. ముక్కోటి ఏకాదశి కావడంతో తెల్లవారుజామున దర్శనం కోసం గుడికి వచ్చిన భక్తులు జరిగిన దొంగతనాన్ని గుర్తించారు. దుండగుడు అమ్మవారి ఆలయ సీసీ కెమెరాలు ఎత్తుకెళ్లిన దృశ్యాలు హార్డ్ డిస్క్‌లో నమోదయ్యాయి. చోరీకి పాల్పడిన గొడ్డలి అక్కడే విడిచిపెట్టి దుండగుడు వెళ్ళిపోయాడు. ఈ ఘటనపై స్థానికులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నారు. అమ్మవారి విగ్రహం ధ్వంసం కావడం, అనకాపల్లి పరిధిలో పలు ప్రాంతాల్లో తరచూ దొంగతనాలు జరగడం, పోలీసులు గస్తీ లేకపోవడం పై స్థానికులు మండిపడుతున్నారు.

మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 26 నుంచి చేపట్టే మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో శనివారం సమ్మెకు సంబంధించిన గోడ పత్రికను మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

ఇవ్వాలని, వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్ వర్కర్లు అందరినీ పర్మినెంట్ చేయాలని, క్లాప్ డ్రైవర్లకు 18,500/- వేతనం ఇవ్వాలని, ఇంజనీరింగ్ వాటర్ వర్క్స్ ,పార్కుల్లో పనిచేసే మున్సిపల్ కార్మికులకు హెల్త్ అలవెన్సులు మంజూరు చేయాలని, పర్మినెంట్ ఉద్యోగుల లీవ్ ఎన్కాష్మెంట్లు, సరెండర్ లీవులు, జిపిఎఫ్ సమస్యలు పరిష్కారం చేయాలని ఈ సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మెకు ప్రజలు సహకరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్, నాయకులు బొమ్మాల రాము, ఎర్రంశెట్టి ఏసుదాస్, అజయ్ కుమార్, నూకరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల చిన్న చూపు

4వ రోజు కొనసాగిన సమ్మె

విశాఖలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని, వేతనాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో భాగంగా కొప్పాకలోని డీఈఓ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న నిరాహార దీక్ష 4వ రోజుకు చేరింది. శనివారం దీక్షా శిబిరాన్ని నాగజగదీష్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షణ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని, దీనిని తెలుగుదేశం పార్టీ సంపూర్ణ సహకారం అందిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తుందని, వారి ఉద్యమాలను అణిచివేయాలని చూస్తోందని ఆరోపించారు. ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పేరుతో వెట్టి చాకిరీ చేస్తున్నారని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని చెప్పిన జగన్ రెడ్డి నేడు మాట తప్పారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నాగ జగదీష్ హామీ ఇచ్చారు.

శిబిరంలో కుప్పకూలిన ఉద్యోగి

అనకాపల్లి : డిఈఓ కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన ఆందోళనలో శనివారం పాల్గొన్న మునగపాక ఎంఈఓ కార్యాలయ డేటా ఎంట్రీ ఆపరేటర్ జడ్డు వాసుదేవ్ బీపీతో శిబిరంలోనే ఒక్కసారిగా కుప్పకూలారు. దీంతో హుటాహుటిన అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి తరలించగా, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్టు వైద్యులు నిర్ధారించారు. దీనికి ఆపరేషన్ చేయాలని డాక్టర్ చెప్పారు. దీంతో ఉష ప్రైమ్ ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఉద్యోగ భద్రత లేకుండా కనీసంగా ఏదైనా అత్యవసర చికిత్స కూడా చేయించుకోలేని స్థితిలో తమ కుటుంబాలన్నీ ఉన్నాయని, ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయాలని ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు.

వాసుదేవ్‌కు చికిత్స అందిస్తున్న దృశ్యం

నాలుగో రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ సంస్థల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, ఆ విధానం తప్పు అని సుప్రీంకోర్టు అభిప్రాయపడిందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారానికి నాలుగో రోజుకు చేరింది. దీనిలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని పాదయాత్ర సమయంలో జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చి నేడు మాట తప్పారన్నారు. ఆయన పాలనలో అన్ని తరగతుల ఉద్యోగులూ, కార్మికులూ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు వి.పుండరీకాక్ష, కార్యదర్శి ఎల్.చైతన్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.గణపతి రావు, గౌరి, శ్రీలత పాల్గొన్నారు. ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, జయశ్రీ తదితరులు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

నిరాహార దీక్ష చేస్తున్న న్యాయవాదులు

ఎపి ల్యాండ్ టైటిల్ యాక్ట్-2023ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్టు- 2023ను రద్దు చేయాలనే డిమాండ్ చేస్తూ అనకాపల్లిలో న్యాయవాదుల ఆందోళన శనివారం కూడా కొనసాగింది. శనివారం నాటి దీక్షలో మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమానికి మద్దతు తెలియజేశారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు శేఖర్ మంత్రి సాయి లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలో మహిళా న్యాయవాదులు ఎస్.లీలవేణి, జె.భారతి లక్ష్మి, ఏ.హిమగిరి, బి. రమాదేవి, బి లీల, కె ఝాన్సీ రాణి పాల్గొన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, కాంగ్రెస్ అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఐఆర్.గంగాధర్, అనకాపల్లి పట్టణ అధ్యక్షులు దాసరి సంతోష్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావాన్ని తెలియజేశారు.

వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు

ప్రజాశక్తి-అనకాపల్లి : వస్తువుల కొనుగోలు, సేవలు పొందడంలో మోసపోయిన, నష్టపోయిన వినియోగదారులు ఇ-డాఖిల్, నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ వెబ్ పోర్టల్ల ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎస్‌సీడీఆర్‌సీ) సభ్యురాలు సి.హెచ్‌వి.సూర్యభాస్కరమ్ స్పష్టం చేశారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్, అనకాపల్లి మండల వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో 'ఈ-కామర్స్, డిజిటల్ వర్తకం, వినియోగదారుల రక్షణ' అంశంపై శ్రీ గౌరీ గ్రంథాలయంలో శనివారం జరిగిన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ-కామర్స్ కంపెనీల మోసాల నియంత్రణకు 'కంట్రీ ఆఫ్ ఆరిజిన్' అమలుకు సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) కృషి చేస్తుందని చెప్పారు. వినియోగదారుల హక్కులు, ప్రయోజనాల రక్షణకు వినియోగదారుల కమిషన్లు అండగా నిలుస్తాయన్నారు. ఈ-కామర్స్ వేదికల ద్వారా విక్రయించు ప్రతి వస్తువు ప్యాకింగ్‌పై ఈ-కామర్స్ నియాయం 6 (5) (డి) ప్రకారం ఆ వస్తువు పూర్తి సమాచారం, ఫిర్యాదుల పరిష్కార పద్ధతులు ప్రకటించాలన్నారు.కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ, ఔషధ నియంత్రణాధికారి ఎన్.కళ్యాణి, నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా యూత్ ఆఫీసర్ జి.మహేశ్వరరావు, కన్స్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సొసైటీ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు రేబాక మధు, పెంటకోట వివిఎస్.నాయుడు, బుద్ద ప్రవీణ్, బొడ్డేడ జగ్గఅప్పారావు, పెతకంశెట్టి శివ, వి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ నిధులతో తాగునీటి బోర్లు ఏర్పాటు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : విశాఖ డెయిరీ ఆధ్వర్యాన గ్రామాల్లో తాగునీటి బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ అన్నారు. బుచ్చయ్యపేట మండల కేంద్రంలో సుంకర, కొల్లివారి కల్లాల వద్ద విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ మంజూరు చేసిన మంచినీటి బోర్ల నిర్మాణ పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమ కోసం విశాఖ డెయిరీ కృషి చేస్తుందన్నారు. బుచ్చయ్య పేటలో ఇటీవల రైతుల కల్లాల వద్ద 15 తాగునీటి బోర్లు వేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు సుంకర శ్రీను, పాల సంఘం అధ్యక్షులు సుంకర బాబ్జి, ముమ్మిన సూర్యనారాయణ, అయితిరెడ్డి రమణ, గుండెం సూర్యనారాయణ, గుండెం నాగన్న దొర, పాల్గొన్నారు.

బోరుబావి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న గేదెల సత్యనారాయణ

రుణ మాఫీపై బయోమెట్రిక్ వేయాలి

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం పంచాయతీలో ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు పర్యవేక్షణలో వైఎస్ఆర్ ఆసరా పథకం 4 విడత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు రుణమాఫీపై బయో మెట్రిక్ వేయాలని, అందుకు మహిళలందరూ వెలుగు సిబ్బందికి సహకరించి కోరారు. ముఖ్యమంత్రి జనవరి 10న డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా పథకంలో రుణమాఫీ 4వ విడతను లాంచింగ్ చెయ్యటం జరుగుతుందని చెప్పారు. మూడు విడతలకు కశింకోట మండలంలోని1537 డ్వాక్రా సంఘాలు, 16830 సభ్యులు ఉండగా, రూ.39 కోట్లు రుణమాఫీ చేసినట్లు చెప్పారు. ఒకొక్క విడత ఆసరా పథకం రుణమాఫీ రూ.13 కోట్లు మంజూరు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మహిళ సమాఖ్య అధ్యక్షులు వేపాడ లక్ష్మీ, ఏపిఎం ఎస్ శ్రీనివాసరావు, సీసీ రామకృష్ణ, విఓఏ పద్మావతి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి సంతతోటలో పేదలకు ఇళ్ల స్థలాల నిర్మాణానికి ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి శనివారం శంకుస్థాపన చేశారు. దేవరాపల్లిలో13 సంవత్సరాల కిందట మహేశ్వరి థియేటర్ ముందు రోడ్డు నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు అప్పట్లో రోడ్డు వెడల్పులో ఇల్లు కోల్పోయిన వారందరికీ సంత తోటలో పట్టాలు ఇచ్చారు. కొన్ని అనివార్య కారణాల వలన అప్పట్లో ఆ ఇంటి పట్టాల మంజూరు నిలిచిపోగా, ఈ పట్టాల మంజూరికై, ఇటీవలే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 31 మంది తమ విషయాన్ని జగనన్నకు చెబుదాంలో తెలియజేశారు. దీంతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి ప్రత్యేక దష్టి చారించి ఆ లబ్ధిదారుల 31 మందికి సంత తోటలో పట్టాలు మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం ఆ ఇంటి స్థలాల్లో ఇంటి నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.లక్ష్మి, గ్రామ సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, వరదపురెడ్డి సింహాచలం నాయుడు, కె.వి.రమణ, సోమిరెడ్డి పేరునాయుడు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయ విధానంతో అధిక ఆదాయం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : సమీకృత వ్యవసాయ విధానం ద్వారా అధిక ఆదాయాన్ని సంపాదించవచ్చని కొన్నెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సత్తిబాబు తెలిపారు. మండలంలోని కొన్నెంపూడి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ అనుబంధ రంగాలపై జిల్లాలోని పలు మండలాలకు చెందిన ఉపాధి కూలీలకు, మెట్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి ఆధారిత సాగు, నైపుణ్య పద్ధతులు, వ్యాపార అభివృద్ధి, ఉద్యానరంగంలో మెలుకువలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డ్వామా పిడి సందీప్, ఏపీడీ రోజా రాణి, బండారు శ్రీనివాస్ మణికుమార్, ఆంజనేయులు, ఏపీఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు ముస్తాబవుతున్న చర్చిలు

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలంలో సోమవారం జరగనున్న క్రిస్టమస్ వేడుకలకు చర్చలు ముస్తాబవుతున్నాయి. కశింకోట, తాళ్ళపాలెం, బయ్యవరం, కన్నూరుపాలెం, నర్సింగిబిల్లి, గ్రామాల్లో పాస్టర్ల ఆధ్యర్యంలో చర్చలకు విద్యుత్ అలకరణ చేశారు కొన్ని చర్చల్లో సేవ కార్యక్రమం చేయడానికి ఏర్పాటు చేశారు

25న కలెక్టరేట్ స్పందన రద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి : క్రిస్మస్ సందర్భంగా ఈనెల 25న ప్రభుత్వ సెలవు దినం కావడంతో సోమవారం స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఈ విషయాన్ని ప్రజలు గమనించి సోమవారం జిల్లాలోని దరఖాస్తులు, ఫిర్యాదులతో కలెక్టర్ కార్యాలయానికి రావద్దని ఆయన కోరారు.

రైతులతోనే దేశానికి ఆహార భద్రత

ప్రజాశక్తి-అనకాపల్లి : రైతులతోనే దేశానికి ఆహార భద్రత ఏర్పడుతుందని ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ కొణతాల హరినాథ్ బాబు అన్నారు. రైతు దినోత్సవం సందర్భంగా అనకాపల్లి కూరగాయల మార్కెట్లో గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన రైతులకు ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి శాఖ మిఠాయిలు పంచి పెట్టారు. 365 రోజులు కూడా కూరగాయలు ఆకుకూరలు అనకాపల్లి తీసుకువచ్చి అనకాపల్లి ప్రజలందరికీ అందిస్తున్నందుకు రైతులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ స్వీట్లు పంచారు. రైతులు కిసాన్ డేను గుర్తు పెట్టుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్ నాయకులు సిహెచ్ శ్రీనివాసరావు, ఎన్ బాబ్జి స్థానికులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం

రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్

మాట్లాడుతున్న బాబు రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి- కె.కోటపాడు

గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడానికి నిధులు ఇవ్వకుండా రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పంచాయతీ రాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, గ్రామ వాలంటీర్లకు ఉన్న గౌరవం సర్పంచులకు లేదని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైబి రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని చౌడువాడలో శనివారం ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ జిల్లా అధ్యక్షులు గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌ల భాగస్వామ్యం అన్న అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లకు విధులు నిధులు లేకుండా, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను పాతాళానికి పాతిపెట్టారని విమర్శించారు. రాష్ట్రం నుంచి రావలసిన నిధులు ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కోట్ల రూపాయలను దారిమళ్లించారన్నారు. గ్రామాల్లో అభివృద్ధి జరగకపోవడానికి సర్పంచ్‌లు ఎంపీటీసీలు కారణం కాదని, రాష్ట్ర ప్రభుత్వమే కారణమని చెప్పారు. గ్రామ వాలంటీర్లను గృహ సారథలను నియమించి వారి ద్వారా పరిపాలన సాగిస్తున్నారు తప్ప ఇందులో ప్రజల ద్వారా గెలుపొందిన ప్రజా ప్రతినిధుల పాత్ర ఏమీ లేదని పేర్కొన్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు మాట్లాడుతూ సర్పంచులు మొఖం చాటు వేసుకుని గ్రామంలో తిరగవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల ముత్యాలు, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ నాయకులు వినోద్ రాజ్, రామకృష్ణ నాయుడు, చుక్క ధనుంజయయాదవ్, చంద్రశేఖర్, సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, జనసేన నాయకులు కుంచా అంజిబాబు, చల్లపల్లి శ్రీను పాల్గొన్నారు

విద్యా సంస్థల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

వేడుకల్లో పాల్గొన్న అనకాపల్లి డైట్ విద్యార్థులు, అధ్యాపకులు

ప్రజాశక్తి -అనకాపల్లి

స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) కళాశాలలో క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ క్రీస్తు శాంతికి, కరుణకు, సేవకు ప్రతీక అని, అందరూ సేవా భావం అలవరించుకోవాలని సూచించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో "వాల్ ఆఫ్ ఫేమ్" అనే వినూత్న ప్రక్రియను ప్రారంభించారు. అకాడెమిక్స్, క్రీడలు వంటి అంశాలలో రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ఘనతను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నోటీసు బోర్డులో పొందుపరిచారు. విద్యార్థులలో ఉత్సాహం నింపడానికి ట్రెజర్ హంట్, స్పాట్ గేమ్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించి అందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, డీన్ అకాడెమిక్స్ డాక్టర్ కె.పార్వతి, అసోసియేట్ డీన్ అకాడెమిక్స్ కృష్ణ నాగ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో క్రిస్మస్ పండుగ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్. జోషఫ్ సురేష్ హాజరయ్యారు. యేసు క్రీస్తు పుట్టుక, పండుగ విశిష్టతను వివరించారు. జీసస్ పుట్టుకపై విద్యార్థుల బుర్రకథ ఆకట్టుకుంది. క్రిస్మస్ పాటలు పాడి నృత్యాలను ప్రదర్శించారు. చిన్నారుల శాంతా క్లాజ్ వేష ధారణ అలరించారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గాజువాక : చైతన్యనగర్‌లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో హెచ్ఎం అరుణకుమారి ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు పరస్పరం గ్రీటింగ్స్ అందజేసుకుని, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జీసస్, శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులు అలరించారు. క్రీస్తుజననం గురించి మాటలు ,పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి విజయలక్ష్మి, మీనాక్షి, జ్యోత్స్న, ఎఒ సత్యనారాయణ అధ్యాపక బృందం పాల్గొన్నారు. విద్యార్థులకు ఆర్ఐ రమణ, ఎజిఎం సురేష్ అభినందనలు తెలిపారు.

భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్‌లో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్కూల్ కరస్పాండెంట్ కె శ్రీనివాస్, ఫాస్టర్ సంతోష్‌పాల్ పాల్గొన్నారు

సీతమ్మధార: గురుద్వారా దరి శ్రీ నవోదయ జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కేకు కట్ చేసి పిల్లలకు పంచారు కళాశాల కరస్పాండెంట్ భీశెట్టి రాము, డీన్ మురళీప్రసాద్, డైరెక్టర్ విశ్వకీర్తి, ప్రిన్సిపల్ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

విశాఖలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

సూర్యనారాయణ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి- అనకాపల్లి : జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయానికి ధనుర్మాసం ముక్కోటి ఏకాదశి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు దేవస్థాన కమిటీ చైర్మన్ కొణతాల బాబురావు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, 5వేల మందికి భారీ అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. 1500 మందికి దాతల చేతుల మీదుగా పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ ముక్కలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటకం, సంగీత గాన కచేరిలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు గొల్లవిల్లి రామ కోటేశ్వరరావు, రామకృష్ణ ప్రసాద్, గొల్లవిల్లి నర్సింగరావు, బండారు రమణ, బండారు వెంకట రమణ, బండారు ఆదిబాబు, గొల్లవిల్లి నాగేశ్వరరావు, గొల్లవిల్లి చిరంజీవి, గొల్లవిల్లి లక్ష్మణ్ త్రినాథ్, గొల్లవిల్లి రవి కుమార్, గొల్లవిల్లి రామకోటి, అందే బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని దిబ్బిడ్డి, బుచ్చయ్యపేట, రాజాం నీలకంఠాపురం, గున్నెంపూడి మల్లం సీతయ్యపేట తదితర గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించారు. దీంతో ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : 200 సంవత్సరాల చరిత్ర కలిగిన అనకాపల్లి కుంచావారి శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక అలంకారం చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఏపీడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, వైసిపి పార్లమెంట్ పార్టీ పరిశీలకులు దాడి రత్నాకర్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, కార్పొరేటర్లు మందపాటి సునీత జానకి రామరాజు, జాజుల ప్రసన్నలక్ష్మి రమేష్, మళ్ల సురేంద్ర, గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ యుఎన్‌వి రావు దర్శించుకున్నారు. వారిని ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు (అబ్బులు) ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు పాండ్రంగి సత్య రావు, కోరుకొండ సాంబశివరావు, పాలూరి శ్రీనివాసరావు, కొమ్మోజి రామకృష్ణ, బొండు జాడేష్, అదేపల్లి పోతురాజు, కుంచా దివాకర్, కుంచా సందీప్, కుంచా వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగుపై రైతులు దృష్టి సారించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రస్తుత పరిస్థితుల్లో రబీ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని, అందుకు వారిని సన్నద్ధులను చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికే జగన్నాథరావు సూచించారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, అభ్యుదయ రైతులతో నిర్వహించిన శిక్షణ సందర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మిచౌంగ్ తుఫాను అనంతరం నేల తేమశాతం చెరకు రబీ పంటలైన మినుము, పెసర, జనుము, నువ్వులు, మొక్కజొన్న, చోడి వంటి పంటలకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఆరుతడి పంటలను కూడా వేసుకోవచ్చని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు మాట్లాడుతూ రబీ పంటలను ప్రోత్సహించడం ద్వారా అధిక ఆదాయం రైతులు పొందవచ్చని చెప్పారు. రైతు దినోత్సవం, మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఘనంగా పాలీఫెస్ట్ 2కె24

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గాలిభీమవరం ఆర్యబట్ట పాలీఫెస్ట్ 2కె24 క్రీడలు ఘనంగా నిర్వహించారు. వీట్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు లక్ష్మీ గణపతి విద్యాసంస్థల చైర్మన్ సిహెచ్ మహందాత నాయుడు, డైరెక్టర్ సిహెచ్ సాయి శ్వేత చేతుల మీదుగా శనివారం అందజేశారు. గత మూడు రోజులుగా పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణరావు, డైరెక్టర్ జి. సురేంద్ర కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

సమన్వయంతో పని చేయాలి

మండల సమావేశంలో ఎంపిపి మణికుమారి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి మణికుమారి

ప్రజాశక్తి-గొలుగొండ:అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి గజ్జలపు మణికుమారి సూచించారు. శనివారం గొలుగొండ మండల పరిషత్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు అర్హులకు అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలు వేగవంతానికి అధికారులు శ్రద్ధ చూపాలని కోరారు.మండల ఇన్చార్జి తహసిల్దార్ జి.ఆనంద్‌రావు మాట్లాడుతూ, పోడు భూముల సాగుదారులకు సంబంధించి 283 మంది లబ్ధిదారులకు పట్టాలు మంజూరయ్యాయని, వచ్చే నెలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇస్తామన్నారు. 2003 సంవత్సరం ముందు డి పట్టాలు పొందిన రైతులకు 22ఏ జాబితా నుంచి తొలగించడానికి ప్రభుత్వం నుంచి 263 మంది లబ్ధిదారులకు అనుమతి వచ్చిందని, వారందరికీ జిరాయితీ పట్టాలను జనవరి నెలలో అందజేస్తామని ఆయన తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు రెండవ జాబితాలో జిరాయితి పట్టాలుగా మార్పు చేస్తామన్నారు. తుఫాన్‌లో నష్టపోయిన రైతులందరి వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేశామని ఆత్మ ఇంచార్జ్ సుప్రియ తెలిపారు. ధాన్యం సేకరణ ప్రారంభించామని రైతులంతా ఆర్బికే కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకు వచ్చే విధంగా ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆమె తెలిపారు. పాకలపాడు జోగంపేట, లింగంపేట సచివాలయాల ఇబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో ప్రజలకు సేవలు అందుబాటులో లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు తెలిపారు. ఇందుకు ఎంపీడీవో డేవిడ్రాజు మాట్లాడుతూ, పూర్తి స్థాయి సిబ్బందిని నియమించడానికి ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సమస్యలు ఎక్కువగా సూపర్ ఎంపీటీసీలే చెప్పడం వాటికి అధికారులు వివరణ ఇవ్వడం విడ్డూరం.చీడి గుమ్మల పీహెచ్సీ వైద్యాధికారి ధనుంజయ్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీపై జనవరి 5వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.ప్రస్తుతం కరోనా సబ్ వేరియంట్‌తో చిన్నపిల్లలు, పెద్ద వయసు కలిగిన వారు ఇబ్బందులకు గురి అవుతారని, జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, వైస్ ఎంపిపి జక్కు నాగమణి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

యువగళం విజయవంతంపై కృతజ్ఞతలు

- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:యువగళం సభను విజయ వంతం చేసిన వారందరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. విజయనగరం జిల్లాలో ఇటీవల చేపట్టిన నారా లోకేష్ యువగళం సభ విజయవంతం చేశారన్నారు. రానున్న మూడు నెలలు సమయం ఉందని, దీని కోసం కార్యకర్తలు శ్రమించాలని కోరారు. యువగళం సభలో ప్రజలు చూపించిన అభిమానాన్ని ఓట్ల రూపంలో మార్చాలన్నారు. మరో మూడు నెలలు కష్టపడితే మన ప్రభుత్వం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం మండల అధ్యక్షులు ఆర్‌వై.పాత్రుడు, నాతవరం మాజీ జెడ్పీటీసీ కరక సత్యనారాయణ, మాజీ ఎంపిపి శింగంపల్లి సన్యాసిదేముడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

అర్హులందరికీ పథకాలు

ప్రజాశక్తి -కోటవురట్ల:వైసిపి ప్రభుత్వం రాష్ట్రం అబివృద్ధికి బాటులు వేస్తోందని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్ అధ్యక్షతన జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయన్నారు. విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అనంతరం ఆయన గ్రామంలో చేపట్టిన పలు అభివద్ధి పనుల బోర్డును ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, జిల్లా వైసీపీ విబాగపు బీసీ సెల్ అధ్యక్షులు రమేష్, సిద్ద బత్తుల సత్యనారాయణ, కుమార్ రాజా పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

కుటుంబీకులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-మాకవరపాలెం:మాకవరపాలెంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. బాల్య వివాహం జరుగుతుందని సమాచారం రావడంతో నర్సీపట్నం ఐసిడిఎస్ సిడిపిఓ మేరీ సువార్త సంఘటనా స్థలానికి వెళ్లి బాలిక, తండ్రితో మాట్లాడారు. వారికి ఈ వివాహం చేయడం వల్ల కలిగే ఇబ్బందిపై కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణారావు, వైద్య, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాపై సమీక్ష

సమీక్ష చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-మాకవరపాలెం:ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలపై మాకవరపాలెం ఇన్‌చార్జ్ ఎంపిడిఒ సీతామహాలక్ష్మి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం మండలంలో ఉన్న పిఈటీలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ, 1609 మంది యువకులు, 1270 మంది యువతులు రిజిస్ట్రేషన్ చేయించు కున్నట్టు తెలిపారు. అనంతరం వీరిని టీములుగా విభజించారు.

కవగుంటలో డ్రెయినేజీ పనులు

ప్రజాశక్తి-రావికమతం:జిల్లాలో మోడల్ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే ధ్యేయమని కవగుంట సర్పంచ్ దాసరి కుమారి, సచివాలయ కన్వీనర్ దాసరి వరాహాలు తెలిపారు. గ్రామంలో డ్రెయినేజి పనులు చేయించారు. ఇందుకు సంబంధించి పైపులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో వాడుక, మురుగు, వర్షపు నీరు నిల్వ ఉండకూడదనే ఉద్దేశంతో పూర్తిగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పారిశు ధ్యానికి తమ సొంత డబ్బులు సుమారు 20వేలు వెచ్చిం చామని తెలిపారు. ప్రభుత్వం నిధులు ఇవ్వాలన్నారు.

ఏర్పాటు చేస్తున్న గొట్టాలు

పరామర్శిస్తున్న గవిరెడ్డి

టిడిపి నేతకు గవిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-మాడుగుల: ప్రమాదవశాత్తు గాయాలతో ఆసుపత్రిలో చేరిన టిడిపి నాయకుడ్ని మాజీ శాసనసభ్యుడు రామానాయుడు పరామర్శించారు. కింతలి గ్రామ టిడిపి అధ్యక్షుడు కోట్ని నాయుడుని విశాఖ పట్నం కిమ్స్ ఆస్పత్రిలో శనివారం రామా నాయుడు కలిశారు. కుటుంబ సభ్యు లకు ధైర్యం చెప్పారు.

ఉపమాక వెంకన్న ఆలయంలో

వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

నక్కపల్లిలో రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపమాక వెంకన్న ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. సుధూరు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.కొండపైన, దిగువున ఉపాలయాల్లోనూ వేయింపజేసిన స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చక బృంధం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ప్రాంగణం తెల్లవారి నుండి సాయంత్రం వరకు భక్తుల రద్దీతో కిటకిటలాడింది.క్యూ లైన్ లో భక్తులు బారులు తీరారు..పలు రాజకీయ పార్టీల నేతలు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం 8 వాహనాల్లో తిరువీధి సేవ ఘనంగా నిర్వహించారు.ఎస్ఐ విభూషణరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులు అధికంగా తరలి రావడంతో ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకులు సంకర్షణ పల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు .

రోలుగుంట:

మండలంలోని వడ్డిప గ్రామంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణ వెంకటేశ్వర స్వామికి తులసిమాల అలంకరణ చేశారు. భజనలు, నగర సంకీర్తనలు అలరించాయి. ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

మాట్లాడుతున్న వైసిపి నేతలు

వైసిపి అభ్యర్థిపై దుష్ప్రచారం ఆపాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పాయకరావుపేట నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పై సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని ఆపాలని వైసిపి పార్టీ విభాగపు జిల్లా బీసీ సెల్ లో అధ్యక్షులు రమేష్, తదితరులు పేర్కొనన్నారు. గడిచిన రెండు రోజులుగా పాయకరావుపేట నియోజకవర్గ అభ్యర్థి లిస్టు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం అందులో స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు పేరు లేదనే ప్రచారాన్ని ఆపాలన్నారు. రానున్న ఎన్నికల్లో గొల్ల బాబురావు పేరు తప్పక ఉంటుందని పార్టీ అధిష్టానం అభ్యర్థిగా నియమిస్తుందన్నారు. పార్టీ ఎవరిని సూచించినా తాము సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా పలువురు అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కుమార్ రాజా, వైసీపీ సీనియర్ నాయకులు సిద్ధ బత్తుల సత్తిబాబు, రమణ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు, గిరిజనులు

వంతెన నిర్మాణం చేపట్టాలి

- ఆదివాసీ గిరిజన సంఘం నిరసన

ప్రజాశక్తి - మాడుగుల: మండలంలోని శివారు గిరిజన గ్రామానికి వంతెన నిర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని శంకరం పంచాయతీ మామిడిపాలెం గ్రామానికి వంతెన నిర్మించాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట. నరసింహమూర్తి మాట్లాడుతూ, మామిడిపాలెం గిరిజన గ్రామానికి బ్రిడ్జి నిర్మాణం చేసి రోడ్డు సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ వంతెన లేకపోవడంతో మిచౌంగ్ తుఫాన్ లో ఉరకగెడ్డ రావడంతో గ్రామస్తులు మాడుగుల సంతకు వచ్చి నిత్యవసర సరుకులు తీసుకువెళ్లే పరిస్థితి కూడా లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించడానికి కూడా అవకాశం లేని పరిస్థితులు ఎన్నో ఉన్నాయని తెలిపారు.మండల పరిషత్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని, తక్షణమే మామిడిపాలెం గిరిజన గ్రామానికి వంతెన నిర్మాణం చేసి రోడ్డు సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో దారపర్తి బాలరాజు, ఉండూరు ఈశ్వరరావు, సోమల శ్రీరామ్మూర్తి, తార దేముడు, దారపర్తి భీమేశ్వరమ్మ, ఉండూరు కర్రమ్మ, తార దేముడమ్మ,గిరిజనులు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలం కేంద్రంలోని శనివారం నిర్వహిస్తున్న వారపు సంతల్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా దుకాణాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ సతీష్ సూచించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను సిబ్బందితో తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వారపు సంతలో ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. సంతల్లో ఇరువైపులా అమ్మకాలు చేపడితే దుకాణాల ఏర్పాటుకు అనుమతించమని ఆయన హెచ్చరించారు. ట్రాఫిక్కు ఇబ్బంది లేకుండా సంత నిర్వహించాలని ఆయన సూచించారు. ఖాళీ స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

మాట్లాడుతున్న నేతలు

28న భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :భవన నిర్మాణ కార్మికులు పెండింగ్ క్లైమ్‌లు, ఇసుక కొరత పై ఈ నెల 28న కలెక్టర్, నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాని జయప్రదం చేయాలని అనకాపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) పిలుపునిచ్చింది. ఎన్‌టిఆర్ స్టేడియంలో శనివారం జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాలు గా భవన నిర్మాణ కార్మికులకు భీమా సొమ్ము చెల్లించలేదన్నారు. సంక్షేమ పథకాలను 1214మెమో జారీ చేసి నిలిపివేసిందని, సంక్షేమ బోర్డు నిదులను ప్రభుత్వ అవసరాలకు వాడుకుందని విమర్శించారు. కేంద్రం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిది చట్టాన్ని రద్దు చేసిందన్నారు.జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ సత్తిబాబు మాట్లాడుతూ సుమారు 4నెలలుగా ఇసుక సరఫరా నిలిచిపోయిందన్నారు. ఈ సమావేవంలో సిఐటియు కన్వీనర్ టి.ఈశ్వరావు, సభ్యులు శివ శేషు లు పాల్గొన్నారు.

అదే..నిరసనల హోరు

-కొనసాగిన అంగన్వాడీల సమ్మె

చోడవరంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం 12వ రోజుకు చేరింది. అనకాపల్లి, విశాఖ జిల్లాలో వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

నక్కపల్లి: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ చేపట్టిన సమ్మె శనివారం నాటికి 12వ రోజుకు చేరింది. మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరం వద్ద అంగన్వాడీలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 12 రోజుల నుండి ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి మార్గం చూపకపోవడం దారుణమని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి,యూనియన్ నాయకులు కవిత,లక్ష్మీ రాజ్యం,మంగ లక్ష్మీ , రమణమ్మ,జయ,ఆర్ వి కె లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు

నర్సీపట్నం టౌన్:నర్సీపట్నంలో అంగన్వాడీల సమ్మెకు అనకాపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కె.రామకృష్ణ మాట్లాడుతూ, 12 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వీరి సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. లేకుంటే భవిష్యత్‌లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

గొలుగొండ:మండల కేంద్రంలో అంగన్వాడీలు సమ్మె చేపట్టారు. నిరసన తెలియజేసినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని అంగన్వాడీలు తెలిపారు. తక్షణమే తమకు 26వేలు జీతం చెల్లించాలని, ఎన్నికల సమయంలో సిఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మె కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోలుగుంట:తమ సమస్యలు పరిష్కరించాలని రోలుగుంటలో అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి మద్దతు తెలిపి మాట్లాడారు. తక్షణమే సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు అప్పలనాయుడు, అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోటవురట్ల: తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కొనసాగించారు. యుటిఎఫ్ నాయకులు అంగన్వాడీ కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

హామీలు అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

చీడికాడ:మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, అంగన్‌వాడీలు యాప్‌లతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కన్నా వెయ్యి రూపాయలు పెంచుతామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం హామీని అమలు చేయాలన్నారు. చింతా ప్రతాప రెడ్డి అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ అంగన్వాడీలపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం తగదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు చింతా ప్రతాపరెడ్డికి తగిన గుణపాఠం త్వరలోనే చెబుతారని తెలిపారు. వీరికి ఏపీ మధ్యాహ్నం భోజన పథకం రాష్ట్ర అధ్యక్షులు జి వరలక్ష్మి, వీఆర్‌ఏల సంఘం మండల నాయకులు శివ సూరిబాబు ,రమణ తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట నాయకులు ఎం.జానకి .రామలక్ష్మి, రాజులమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

రావికమతం :అంగన్వాడీల సమ్మె 12వ రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి

కె.కోటపాడులో...

లోకనాథం మాట్లాడుతూ, ప్రభుత్వం అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చే అంతవరకు సమ్మెను విరమించేది లేదని తెలిపారు. ఆశ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వజ్రపు సత్యవతి, ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యదర్శి సత్యవేణి, అధ్యక్షులు బి.వరలక్ష్మి పాల్గొన్నారు.

మునగపాక : మండల కేంద్రం మునగపాకలో అంగన్వాడీలు చేపట్టిన నిరసన శనివారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. శిబిరంలో ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై నినాదాలు మిన్నంటాయి. శిబిరాన్ని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ్ కుమార్ సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిసెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, జనసేన నాయకులు టెక్కలి పరశురాం,పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీల సమ్మె శిబిరం కొనసాగింది. ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించకుండా ప్రజలకు తప్పుడు సమాచారమిస్తూ చెవిలో పువ్వులు పెడుతోందని తెలియజేస్తూ చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా బలవంతంగా తాళాలు బద్దలు కొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, జయశ్రీ, షిప్‌యార్డ్ యూనియన్ నాయకులు ప్రసాద్, జానకిరాం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి. మణి, నాయకులు వై.తులసి, ఇందిర, ఈశ్వరమ్మ, రత్నం, వెంకటలక్ష్మి, శోభారాణి, నాగేశ్వరి, ఉమ, శ్రీదేవి, పి.శ్యామలాదేవి, రాజేశ్వరి పాల్గొన్నారు.

భీమునిపట్నం : అంగన్వాడీల నిరవధిక సమ్మె శనివారం 12వ రోజుకు చేరిన సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో రిలేదీక్షలు ప్రారంభించారు. సిఐటియు భీమిలి జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కొవ్వాడ లక్ష్మి, పి పద్మావతి, శ్రీదేవి విజయ, ఎఐటియుసి నాయకులు అనురాధ పాల్గొన్నారు

పెందుర్తి : అంగన్వాడీల సమ్మెలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద 12వ రోజు దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా ప్రధాన

రోలుగుంటలో...

కార్యదర్శి ఆర్‌కెవిఎస్.కుమార్ మాట్లాడుతూ, న్యాయమైన డిమాండ్లతో అంగన్వాడీలు 12రోజులుగా సమ్మె చేస్తున్నా చీమకుట్టినట్టయినా వ్యవహరించని వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సిఐటియు నగర కార్యదర్శి బి జగన్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బృందావతి, భవానీ, దేవి పాల్గొన్నారు.

చోడవరంఅంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి సమస్యల్ని పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. చోడవరం మండలం కార్యాలయం వద్ద అంగన్వాడీల దీక్ష శిబిరాన్ని శనివారం లోకనాథం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించని ప్రభుత్వం వారికి సంక్షేమ పథకాలు ఎందుకు ఇవ్వలేదని, కనీస వేతనం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్‌వి.నాయుడు, మిడ్డేమీల్స్ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి వరలక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ మండలం తాసిల్దార్ కార్యాలయం రిలే నిరాహార దీక్షలు 12వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ నిరాహార దీక్షలకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులుపాల్గొన్నారు.

కశింకోట : కసింకోటలో అంగన్వాడి కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు శనివారం 12వ రోజు చేపట్టారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు డిడి వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు తనుజ, ఉమవతి, ధనలక్ష్మి ఎం.హైమావతి, వి.వెంకటలక్ష్మి, పాల్గొన్నారు

రాంబిల్లి : స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ వద్ద అంగన్వాడీ కార్యకర్తలు 12వ రోజు సమ్మెలో భాగంగా శనివారం నిరాహార దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జి దేవుడు నాయుడు, కూండ్రపు సోమునాయుడు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు దినబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పి నూకున్నదొర పార్టీ కార్యకర్తలు పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : అంగన్వాడి కార్యకర్తలు తమ సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం 12వ రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.వరలక్ష్మి, పి.కన్నతల్లి, సన్యాసమ్మ, కె. కోమలి, చెల్లయ్యమ్మ, జయ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన దీక్షలు 12వ రోజుకు చేరాయి. వీరి ఆందోళనకు ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు గండి నాయనబాబు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేముడు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి భవాని, సాయిలక్ష్మి, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

సబ్బవరం : మండల కేంద్రంలో అంగన్వాడీల రిలే దీక్షలు12వ రోజు కొనసాగాయి. కార్యక్రమంలో వి.సుభాషిణి, ఎం. కనకమ్మ, జి. అరుణ కుమారి, ఎస్. రమణమ్మ, డి. భారతి, ఎ. రమణమ్మ, పి. సూరమ్మ, ఎస్. సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.